అలాంటి ఆలోచన ప్రభుత్వానికి లేదు

- జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి
- జీఓ నెం. 55, 60లపై చర్చ
- పదేళ్లు దాటితే రిజిస్ట్రేషన్
- ప్రస్తుతం సుమారు 1100 పైన నివాసాలు గుర్తింపు


మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో నివాసముంటున్న వారిని ఖాళీ చేయిస్తున్నారని ప్రచారం జరుగుతోందని, అలాంటి ఆలోచన ప్రభుత్వానికి లేదని, ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్నప్పటికీ రిజిస్ట్రేషన్ అవకాశం కల్పిస్తున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని అసైన్డ్‌మెంట్ భూములు, ప్రభుత్వ భూముల్లో పక్కా ఇళ్లు నిర్మించుకొని నివాసముంటున్న వారి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఓ నెం. 55, 60లపై జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి శుక్రవారం తాడేపల్లి కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ శారదాదేవి, ఇతర అధికారులతో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జీఓ నెం. 55 ప్రకారం అసైన్డ్ భూములలో నివాసాలు ఏర్పాటు చేసుకుని పదేళ్లకు మించి ఎవరైతే ఉంటారో వారికి రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. అలాగే అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకుని ఉన్న వారిని గుర్తించి 100 గజాలలోపు ఉంటే ఉచితంగా రిజిస్ట్రేషన్, 100 గజాలు దాటితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం రుసుము చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకునే సౌకర్యం ప్రభుత్వం జీఓ నెం. 60 ద్వారా అవకాశం కల్పించిందని తెలిపారు.

ప్రస్తుతం ఇప్పటి వరకు రెవిన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ ప్రాంతాల్లో 1100 నివాసాలు గుర్తించారని, ఇంకా సర్వే జరుగుతోందని నివాసాల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుందని, త్వరలోనే వీరందరికి పక్కా రిజిస్ట్రేషన్లు చేస్తామని ఆమె స్పష్టం చేశారు. తాడేపల్లి, మంగళగిరి పట్టణ పరిధిలో రైల్వే స్థలాల్లో నివాసముంటున్న వారి ఇళ్లు తొలగించే ఆలోచన లేదని, ఒక వేళ రైల్వేశాఖ తొలగిస్తే వారందరికి పక్కా నివాసాలు ఇచ్చే వరకు ఆ నివాసాలను తొలగించవద్దని రైల్వే శాఖను కోరతామని స్పష్టం చేశారు. 1980 నుంచి 2000 సంవత్సరం వరకు దఫాలు వారీగా 1175 మందికి డి పట్టాలు ఇచ్చామని, అవి కూడా రెగ్యులైజేషన్ చేయనున్నట్లు స్పష్టం చేశారు. నగర పరిధిలో బరియల్ గ్రౌండ్ సమస్య ఉందని, ఆ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఆలోచిస్తోందని అన్నారు. నిడమర్రులో బరియల్ గ్రౌండ్‌కు 66 సెంట్ల భూమిని కేటాయించామని, ప్రస్తుతం అది కోర్టు పరిధిలో ఉందని, కేసు కొట్టివేసిన అనంతరం పూర్తి అనుమతులతో బరియల్ గ్రౌండ్‌ను అందుబాటులోకి తెస్తామని తెలిపారు. ఇప్పటికే తాడేపల్లి తహసీల్దార్ మర్రెడ్డి నాగిరెడ్డికి స్థల విషయమై రాతపూర్వకంగా అందించామని, ఆయనతో పాటు నగర పాలక సంస్థ పరిధిలో ప్రభుత్వ భూములు ఎక్కడ ఉన్నాయో టౌన్ ప్లానింగ్ అధికారులు పరిశీలిస్తున్నారని, త్వరలోనే బరియల్ గ్రౌండ్ సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి, డీఈ కృష్ణారెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ల సర్వే పరిశీలన

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలో తహసీల్దార్ మర్రెడ్డి నాగిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సతీష్, ఆర్ఐలు వంశీ, ప్రశాంతిలు బూత్‌లెవల్ అధికారులతో కలిసి శుక్రవారం పర్యటించారు. తహసీల్దార్ నాగిరెడ్డి వడ్డేశ్వరం, కుంచనపల్లి గ్రామాల్లో బీఎల్‌ఓలతో కలసి ఇంటింటికి తిరిగి కొత్త ఓట్లు నమోదు చేయడంతోపాటు, మృతి చెందిన వారి ఓట్లు తొలగించడం, అదే గ్రామంలో ఉంటూ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లిన వారిని గుర్తించి ఓట్ల చిరునామాలు మార్చే విధానాన్ని పరిశీలించారు. అనంతరం బూత్‌లెవల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఏ నివాసంలో అయినా 10 ఓట్లకు మించి ఉంటే తప్పని సరిగా ఆ ఇంటిని పరిశీలించాలని సూచించారు. పెనుమాకలో డిప్యూటీ తహసీల్దార్ సతీష్, ప్రాతూరు గుండిమెడ గ్రామాల్లో ఆర్ఐలు వంశీ, ప్రశాంతిలు విస్తృతంగా పర్యటించి ఓట్ల జాబితాను పరిశీలించారు.

ఉన్నత విద్యాశాఖతో కేఎల్‌యూఎంఓయూ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలోని ఏసీఐసీ కేఎల్ స్టార్టప్‌ల ఫౌండేషన్ గేట్ 60 స్టార్టప్ కేంద్ర విద్యాశాఖతో అవగాహన ఒప్పందం చేసుకున్నట్లు ముఖ్య కార్యనిర్వహణాధికారి అలోక్ గోవిల్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ స్టార్టప్‌లలో ఒకటైన గేట్ 60 భారత ప్రభుత్వంలోని విద్య, నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి డాక్టర్ సుభాస్ సర్కార్‌తో కలసి విద్యా మంత్రిత్వ శాఖతో ఒక అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో తాము కేంద్ర మంత్రులతో కలసి అవగాహన పత్రాలు మార్చుకున్నట్లు తెలిపారు.

కష్టపడి పనిచేసిన వారికి పార్టీలో తగిన గుర్తింపు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్
- పొన్నెకల్లు సొసైటీ అధ్యక్షుడు బాధ్యతల స్వీకారం


సొసైటీ చైర్మన్ శ్రీనివాసరావుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న కత్తెర సురేష్‌కుమార్

నిడుముక్కల(తాడికొండ): కష్టపడి పనిచేసిన వారికి పార్టీలో తప్పక మంచి గుర్తింపు లభిస్తుందని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో పొన్నెకల్లు కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడుగా కోట శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ కో ఆపరేటివ్ సొసైటీలను బలోపేతం చేసి రైతులకు సేవలను మరింత చేరువ చేసిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషిని గుర్తుపెట్టుకొని నూతనంగా అధ్యక్షులుగా ఎన్నికైన సభ్యులు రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. గత ప్రభుత్వ పాలనలో చంద్రబాబు రైతులకు చేసింది శూన్యమని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు సేవలను చేరువ చేసేందుకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి గ్రామీణుల చెంతకు నాణ్యమైన ఎరువులు, పురుగుమందులు అందజేస్తున్నారన్నారు. వ్యవసాయం రైతులకు చేరువ చేసి లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా కొనసాగుతున్న జగనన్న పాలనలో అర్హులైన రైతులకు అన్ని సౌకర్యాలు అందించాలని సూచించారు. అనంతరం నూతన చైర్మన్ కోట శ్రీనివాసరావు, సభ్యులను నియామకపత్రం అందించి సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాదాసు రత్నకుమారి, మాజీ ఉప సర్పంచ్ మాదాసు ఏసురత్నం, మాజీ ఎంపీపీ బండ్ల పున్నారావు, వివిధ విభాగాల వైఎస్సార్‌సీపీ నాయకులు తాళ్ల శివనాగరాజు, బొర్రా వెంకటేశ్వరరెడ్డి, అత్తోట అక్కయ్య, బాకి వెంకటస్వామి, బోడపాటి ధర్మరాజు, పద్మరాజు, తాడిబోయిన శివన్నారాయణ పాల్గొన్నారు.

మహనీయుల త్యాగాలను గుర్తుచేసుకోవాలి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్
- పలుచోట్ల నా భూమి–నా దేశం కార్యక్రమం


లాంలో మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్

లాం(తాడికొండ): దేశ సంక్షేమం కోసం ప్రాణాలర్పించిన మహనీయులు, సాహసవంతులు, వీరుల త్యాగాలను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. తాడికొండ మండలం లాం గ్రామంలో నిర్వహించిన నిర్వహించిన నా భూమి–నా దేశం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. లాంలోని నూతన సచివాలయంలో మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం కత్తెర సురేష్‌కుమార్ చేతుల మీదుగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మహనీయుల త్యాగాలను అందిరికీ తెలియజేసేందుకు ప్రభుత్వం నా భూమి–నా దేశం కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సొసైటీ డైరెక్టర్ రావూరి నరేష్, వైఎస్సార్ సీపీ నాయకులు రాయపూడి రంగారావు, షేక్ సలీమ్, షాజహాన్ దీవెన రాజు, ఎంపీడీవో అత్తోట దీప్తి తదితరులు పాల్గొన్నారు.

పెదపరిమిలో...

తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామంలో నిర్వహించిన నా భూమి–నా దేశం కార్యక్రమంలో భాగంగా పెదపరిమి సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సచివాలయంలో మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి శివన్నారాయణ, సొసైటీ అధ్యక్షుడు మున్నంగి కోటిరెడ్డి, నంబూరు రఘునాధరావు, కొప్పుల శేషగిరిరావు, అక్కల లక్ష్మీనారాయణరెడ్డి, బెజ్జం రాంబాబు, ఆరేపల్లి జోజి, పుట్టి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో నా భూమి..నా దేశం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల గ్రామంలోని డాక్టర్ కెఆర్ఆర్ ఎం డిగ్రీ కళాశాల, కేఎస్. జూనియర్ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నా భూమి–నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ కె.గిరిధరరావు మాట్లాడుతూ పర్యావరణ పరిక్షణకు మొక్కలు ఎంతగానో ఉపయోగపడతాయని, నేటి మొక్కలే రేపటి వృక్షాలై ముందు తరాలకు నీడను ఇస్తాయని, భవిష్యత్ తరాలకు మెరుగైన ఆరోగ్యం కావాలంటే ఇప్పుడు మనం తప్పని సరిగా మొక్కలు నాటాలని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సరళాదేవి, ఎస్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బి.రాంబాబు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

మణిపూర్ ఆదివాసీలపై దమనకాండను నిరసిస్తూ ర్యాలీ


నిరసన ర్యాలీలో పాల్గొన్న ముస్లిం, వివిధ ప్రజాసంఘాలు సభ్యులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని నులకపేటలో మణిపూర్‌లో జరుగుతున్న దమనకాండను ఆపాలంటూ ముస్లిం సంఘాలు, ఆటో యూనియన్, వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. జామియా మస్జిద్ అధ్యక్షులు సలీం బాషా మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లింలపై దాడులు పెరిగాయని అన్నారు. పీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి బి.కొండారెడ్డి మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించి, అత్యాచారం చేసి చంపారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని, మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసి అక్కడ రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. ఆటో యూనియన్ అధ్యక్షులు వేపచెట్టు శ్రీను మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ హయాంలో దేశంలో ముస్లిం, క్రైస్తవులపై దాడులు పెరిగాయని, మణిపూర్ బాధితులకు న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ మర్రెడ్డి నాగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీకేఎస్ జిల్లా కార్యదర్శి పోతురాజు, చాంద్‌బాషా, ఇర్ఫాన్, జిలాని, ఇమ్రాన్, ఖాసిం, సైదులు, జి.శ్రీనివాసరావు, వరమ్, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్కేకు జాతీయ పతాకం బహూకరణ



మంగళగిరి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తపాలాశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న హర్ ఘర్‌గా తిరంగా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక తపాలాశాఖ అధికారులు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)ను కలసి జాతీయ పతాకాన్ని బహూకరించారు. నగరంలోని అన్ని తపాలాశాఖ కార్యాలయాల్లో జాతీయ పతాకాలు అందుబాటులో ఉన్నట్లు మంగళగిరి సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాధాకృష్ణ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంత పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నులకపేట సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు డోలాస్‌నగర్, కృష్ణనగర్, నులకపేట, బ్రహ్మానందపురం, పోలకంపాడు, సాయినగర్ కట్టలలో సరఫరా ఉండదు.

తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం


విత్తనాలు చల్లే విధానం పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.రాజకుమారి

ఫిరంగిపురం: తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం సంపాదించవచ్చని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.రాజకుమారి అన్నారు. మండలంలోని అమీనాబాద్ గ్రామంలోని ఆచార్య వెంకటరాయ్య ప్రకృతి యోగా సంజీవని ఆరోగ్యసదనం వారి ఆశ్రమంలో 20 సెంట్లలో వేసిన ఏటీఎం మోడల్ బెడ్లులో 25రకాల విత్తనాలను కె.రాజకుమారి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ నాలుగున్నర అడుగుల వెడల్పుతో ప్రతి బెడ్డుకు మధ్యలో అడుగు వెడల్పు నీటి తడుల కోసం కాలువలు తీయించాలని చెప్పారు. బెడ్లలో ముల్లంగి, బీట్రూట్, క్యారట్, స్వీట్‌కార్న్, గోరుచిక్కుడు, జొన్న, సజ్జ, ఆముదాలు వంటివి ఏర్పాటు చేసుకోవాలన్నారు. దీనిద్వారా రైతులకు ఎంతో ఆదాయం చేకూరుతుందని చెప్పారు. కార్యక్రమంలో సత్యసాయి జిల్లా మెంటారు భార్గవ్, వీరలక్ష్మి, ఝాన్సీ, ఎం.అన్నామణి, ఇ.వెంకటేశ్వర్లు, రామకృష్ణ, తిరుపతిరావు, సుబ్బారావు, ప్రభావతి, అమల, అరుణ, నరేష్; ప్రశాంతి, జ్యోతి, గాయత్రి, వాణి, విజయలక్ష్మి, మేరీ, పెద్దారావు, జోసఫ్, లక్ష్మారెడ్డి, రాఘవేంద్ర, రైతులు పాల్గొన్నారు.

జగనన్న సహకార విద్యా జ్యోతి పథకం సద్వినియోగం చేసుకోవాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సిద్ధయ్య

మేడికొండూరు: మేడికొండూరు రెండో గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం జగనన్న సహకార ఉన్నత విద్య పథకం బ్రోచర్ విడుదల కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జెడ్పీటీసీ సభ్యులు కందుల సిద్ధయ్య మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాల్లో విద్యార్థుల ఉన్నత చదువులు ఆర్థిక భారంతో ఆగిపోకూడదనే ఉద్దేశంతో జగనన్న సహకార పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని అన్నారు. విద్యకు సంబంధించి విదేశాల్లో బీటెక్, ఎంటెక్, బీ ఆర్క్, ఎంఆర్క్ ఎంబీబీఎస్, ఎంఎస్, ఎండీ, బీడీఎస్, ఎండీ తదితర కోర్సుల్లో చదువుకునే పేద విద్యార్థులకు, గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లిమిటెడ్ తెనాలి ద్వారా రుణాలు గరిష్టంగా రూ.40 లక్షల రుణ పరిమితి కల్పించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచి కె.సామ్రాజ్యం, పంచాయతీ కార్యదర్శి బందెల రమేష్, వెల్ఫేర్ కార్యదర్శి దివ్య, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

మంగళగిరి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యర్రబాలెం పారిశ్రామికవాడకు చెందిన బాసాటి నాగ ఆంజనేయులు కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్కే రూ.10వేలు, మసీదు వీధికి చెందిన దివ్యాంగుడు షేక్ హుస్సేన్‌కు రూ.10వేలు స్థానిక పార్టీ నేతల చేతుల మీదుగా అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు బాధితులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) రూ.45వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పెదవడ్లపూడికి చెందిన కొదమల ఇస్సాకు, పాస్టర్ కటారి బాలస్వామి, గుండిమెడ సుధారాణి, దూరు జాన్సన్, దగాని ఏసోబు, దగాని మాతయ్య, బేరి శివ, గుర్రం రమేష్‌లకు ఎమ్మెల్యే ఆర్కే శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుల చేతుల మీదుగా రూ.45వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

కొండవీటి వాగులో తూటికాడను తొలగించాలి

ఎమ్మెల్యే ఆర్కేకు రైతు సంఘం నాయకుల వినతి

తాడేపల్లిరూరల్: కొండవీటి వాగులో పేరుకుపోయిన తూటికాడను తొలగించాలని కోరుతూ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)ని ఆయన నివాసంలో రైతు సంఘం నాయకులు శుక్రవారం కలసి వినతిపత్రం అందజేశారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ సుమారు 20 గ్రామాలకు చెందిన 20,000 ఎకరాలు మునిగిపోయే ప్రమాదం ఉందని, ముంపు నివారణా చర్యలు తీసుకోవాలని కోరారు. దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కొరపోలు ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి అంజిరెడ్డి కాలనీ నందు ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, ఫెన్సిళ్లు శుక్రవారం పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనూరాధ మాట్లాడుతూ వీఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వేశపోగు రాజారత్నం 60 మంది విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలను, ఫెన్సిల్స్, బిస్కెట్లు, చాక్లెట్స్ అందజేశారని అన్నారు. రాజారత్నం మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకోవాలని, చదువుతోనే ఉన్నత శిఖరాలు చేరుకుంటారని, విద్యను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీంద్రబాబు, సంగీత తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై సీపీఎం నిరసన

తాడేపల్లిరూరల్: కొలనుకొండ జాతీయ రహదారి వద్ద సీపీఎం ఆధ్వర్యంలో క్విట్ కార్పొరేట్, సేవ్ ఇండియా, సేవ్ అగ్రికల్చర్ నినాదంతో నిరసన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సీపీఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సీపీఎం మండల కార్యదర్శి డి.వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు కె.శివరామకృష్ణయ్య, కొలనుకొండ గ్రామ కార్యదర్శి కె.శివన్నారాయణ, గద్దె శ్రీనివాసరావు పాల్గొన్నారు.